క్లుప్తంగా

అంకేపల్లిలో నేడు మెగా రుణమేళా

మద్దిపూడి: మండలంలోని అంకేపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మెగా రుణమేళా నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి శ్రావణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే రుణమేళాలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వేణు, మండల స్థాయి అధికారులు, పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ పాల్గొంటారని పేర్కొన్నారు. అంకేపల్లి పంచాయతీ పరిధిలోని సన్నమూరు, గంజిపాలెం గ్రామాల మహిళా రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి



ఉలవపాడులో ఎస్ఎఫ్ఐ జీబుజాతా

ఉలవపాడు: రామాయపట్నం పోర్టులో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైయఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ అన్నారు. ఉలవపాడులో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జీబుజాతాను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉలవపాడులో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. ముందుగా హైస్కూల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, నరేంద్ర, అజయ్, చైతన్య, నరశింహ పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు, నగదు అందజేత



నిత్యవసర సరుకులు అందచేస్తున్న ట్రస్టు చైర్మన్

కనిగిరి రూరల్: కనిగిరి స్నేహ హస్తం, బేస్తవారిపేట గుడ్ సమారిటన్ ట్రస్టుల ఆధ్వర్యంలో మండలంలోని లింగారెడ్డిపల్లిలో తీవ్ర అనారోగ్యంతో ఉన్న పిక్కిలి శివ కుటుంబానికి బుధవారం నిత్యవసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్లు సుధీర్ బాబు, ఆర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ ట్రస్టు ద్వార పేదలకు తమ వంతు సాయం ఎల్లప్పుడు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో దాత సుధాకర్, బలసాని రూబెన్, రాజు పాల్గొన్నారు.

రేపు చెట్టుమహాలక్ష్మమ్మ ఆలయంలో మహాకుంభాభిషేకం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో శుక్రవారం ఉదయం మహాకుంభాభిషేకం, గంగాపార్వతి, కాశీ విశ్వేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం విష్ణు, లలితా సహస్ర నామ పారాయణం, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



గోపిక వేషధారణలో చిన్నారిబాలిక



తిమ్మరాజుపల్లిలో చిన్నారులు

పామూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పామూరుతోపాటు మండలంలోని పలుపాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు, కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపోటీలు అలరించాయి. ఈసందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. గురువారం స్థానిక మదన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది.

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లులు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేది ఉదయం 6 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుందన్నారు. అనంతరం స్వామికి పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజలు, చిన్నారులచే రాధాకృష్ణ వేష ప్రదర్శన, మహిళల కోలాట భజనలు, మంత్ర పుష్పం, వేద పండితుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతాయని, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీఎస్‌పురం (పామూరు): శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలోని తిమ్మరాజుపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు వేషధారణలు, విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు అలరించాయి. రాధాకృష్ణుల వేషధారణలో పాఠశాలకు చెందిన యూయేజీ విద్యార్థి వర్షిత్, ఒకటవ తరగతికి చెందిన శ్రావ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అంకమ్మతల్లి ఆలయానికి భారీగా విరాళాలు



విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లికి బుధవారం భక్తుల నుంచి భారీగా విరాళాలు అందాయి. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో పలువురు భక్తులు పెద్ద మొత్తంలో విరాళాలు అందించారు. వీరిలో తోకల కోటేశ్వరరావు, వెంకటరాధలు రూ.1,11,116, తూమాటి వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులు రూ.1,00,116, మేడా మల్లిఖార్జున, రాజ్యలక్ష్మీలు రూ.50,116, మాదాల వెంకటసుబ్బయ్య, కోటేశ్వరమ్మ రూ.51,116, మాదాల వెంకట బసవయ్య, కోటేశ్వరమ్మలు రూ. 51,111, సాదినేని వెంకటకృష్ణారావు, మంజులతలు రూ. 25,116, దివి శ్రీనివాసులు, అనసూయలు రూ.25,116, తానికొండ రాజశేఖర్, రజనీకుమారిలు రూ 25,116లు, కొచ్చెర్ల మాల్యాద్రి, వెంకటేశ్వరి రూ.10,116లు కొచ్చెర్ల వెంకటేశ్వర్లు, నారాయణమ్మలు రూ.5,116, బి నరశింగరావు రూ.5016, ఇప్పగుంట నాగచంద్రిక, వసుంధరలు రూ.21,116 అమ్మవారి ఆలయ పునర్నిమానికి విరాళంగా అందించారు. వీరికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కందుకూరు చేరిన ప్రజా సంక్షేమ పాదయాత్ర



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న కందుకూరు నాయకులు

కందుకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటూ, నవరత్నాల పథకాల ప్రయోజనం గురించి వివరిస్తూ మార్కాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ జిలానీ బాష, నాయబ్‌గౌస్, కాశిం, హజీజ్, బాలుయాదవ్‌లు చేపట్టిన ప్రజా సంక్షేమ పాదయాత్ర బుధవారం కందుకూరు పట్టణానికి చేరింది. ఈ యాత్రకు స్థానిక వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, వక్ఫ్‌బోర్డు మెంబర్ సంధాని, రహీంలు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న జిలానీ మాట్లాడుతూ జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మార్కాపురం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు 4200 కి.మీల పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1709 కి.మీల పాదయాత్ర పూర్తి చేశామని, 8 జిల్లాల్లో యాత్రపూర్తి చేసుకుని 34వ నియోజకవర్గంగా కందుకూరు వచ్చినట్లు తెలిపారు. యాత్రలో నవరత్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. జగనన్న పుట్టిన రోజైన డిసెంబర్ 21వ తేదీ నాటికి ఇచ్చాపురంలో యాత్ర ముగిస్తామని తెలిపారు. తమ పాదయాత్రకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మరోసారి మానుగుంట మహీధర్‌రెడ్డి విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం తమ పాదయాత్ర ఒంగోలు చేరుకుంటుందని తెలిపారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

- ఆరోగ్యంతో పాటు అధిక ఆదాయం
- ఏపీసీఎన్ఎఫ్ డీపీపీ శ్రీకాంత్



ఆకుకూరలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలతో సంవత్సరం పొడవునా ఆరోగ్యంతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని డీపీపీ శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఆకుకూరలు, కూరగాయల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతు కొర్లపాటి సద్గుణ పొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసిన 30 రకాల ఆకుకూరలు, కూరగాయలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు డీపీపీ శ్రీకాంత్, మెంటర్ రామంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జి ఎల్1 వెంకట్రావు, ఎల్ 2 విజయలక్ష్మి, ఐసీఆర్పీలు శృతి, మరియమ్మ, హరిత, జ్యోత్స్న, సుజాత, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరంలో చైర్మన్ గఫార్, సమితి సభ్యులు

కనిగిరి రూరల్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ ప్రారంభించి మాట్లాడుతూ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో సేవాహిత కార్యక్రమాలు చేపట్టడాన్ని కొనియాడారు. ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎంవీకే కృష్ణ చైతన్య వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ నాయబ్ రసూల్, పసుపులేటి అరుణోదర్, నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఎస్కే నాయబ్ రసూల్, ఈర్ల విజయరామరాజు, ఆర్ఎంపీ వైద్యులు ద్రోణాదుల చెంచులు, ఎల్ఐసీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి వరికూటి పరామర్శ



గంగాధర్‌ను పరామర్శిస్తున్న వరికూటి అశోక్‌బాబు

జరుగుమల్లి: మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎ.గంగాధర్‌కు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై ఒంగోలులోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. గంగాధర్ తండ్రి గంగయ్యను ఓదార్చారు. ఆయన వెంట పోకూరి వెంకటేశ్వర్లు, కసుకుర్తి చినకోటయ్య, నవీన్ ఉన్నారు.

సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాలకొండయ్య

కందుకూరు: ప్రజా సమస్యలపై సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర ఈ నెల 8వ తేదీ తిరుపతి చేరుకుంటుందని, ఆ సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అధిక ధరల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతన్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను నరేంద్రమోడీ నెరవేర్చకుండా ప్రజాస్వామానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, రాజ్యసభ సభ్యులు బినయ్‌విశ్వం, జాతీయ కార్యదర్శి కె నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్, కె మురళి, నత్తా రామారావు, డి. ఆదినారాయణ పాల్గొన్నారు.

రజియాను పరామర్శించిన ముస్లిం నాయకులు



పరామర్శిస్తున్న ముస్లిం నాయకులు

ఒంగోలు టౌన్: మహిళా దొంగల దాడిలో గాయపడిన బ్యూటీషియన్ షేక్ రజియాను ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు పరామర్శించారు. బుధవారం రజియా ఇంటికి చేరుకున్న ఎంహెచ్‌పీఎస్ నాయకులు ఎండీ నిజాం, షేక్ షెహనాజ్, ఆరీఫ్, రియాజ్, ఇమామ్ తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు.

పగిలిన కనిగిరి సాగర్ పైప్‌లైన్

- తక్షణ మరమ్మతులు చేపట్టిన అధికారులు
- రెండు రోజుల్లో యధావిధిగా నీరు సరఫరా చేస్తాం: కమిషనర్



పగిలిన సాగర్‌లైన్‌ను మరమ్మతులు చేస్తున్న వాటర్ లైన్ సిబ్బంది

కనిగిరి రూరల్: దర్శి ఎస్ఎస్ (సమ్మర్ స్టోరేజ్) ట్యాంక్ వద్ద జరుగుతున్న పనుల ప్రక్రియల్లో కనిగిరికి సాగర్ జలాలు సరఫరా జరిగే పైప్‌లైన్ పగిలింది. దీంతో బుధవారం కనిగిరిలో సాగర్ జలాలు నిలిచాయి. ప్రతి రోజు దర్శిలో ఉన్న కనిగిరి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి కనిగిరికి సుమారు 4 లక్షల లీటర్ల సాగర్ జలాలు సరఫరా అవుతాయి. దర్శిలో ఉన్న కనిగిరి ఎస్ఎస్ ట్యాంక్ ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురి కావడంతో సాగర్ నీరు పంపింగ్ నిలిచింది. పగిలిన పైప్‌లైన్ లీకేజీ ప్రదేశాలను వాటర్ లైన్ సిబ్బంది గుర్తించారు. ఈమేరకు మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో తక్షణ మరమ్మతుల పనులు ప్రారంభించారు. రెండ్రోజుల్లో మరమ్మతులు పూర్తవుతాయని, శనివారానికి సాగర్ నీరు యధావిధిగా కనిగిరి ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పేర్కొన్నారు.

12 వాహనాలపై కేసు నమోదు



వాహనాలను తనిఖీచేస్తున్న దర్శి ఎంవీఐ రవికుమార్

పామూరు: నిబంధనలు పాటించకుండా నడుస్తున్న 12 వాహనాలపై కేసు నమోదు చేసి రూ.1.90 లక్షల జరిమానా విధించినట్లు దర్శి ఎంవీఐ కుమ్మరికుంట రవికుమార్ తెలిపారు. పామూరు మండలంలో లైసెన్స్ లేనివి, ఇతర నిబంధనలు పాటించని ఆటోలు, బైక్‌లు మొత్తం 10 యజమానుపై కేసు నమోదు చేసి రూ.70 వేలు జరిమానా విధించినట్లు ఎంవీఐ తెలిపారు. అదేవిధంగా సీఎస్‌పురం మండలంలో ఒక టిప్పర్, మినీలారీ 2 వాహనాలపై కేసు నమోదుచేసి రూ.1.20 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా మద్యంసేవించి వాహనం నడిపినా, అధికలోడ్‌తో వాహనం నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



అర్బన్ కాలనీలో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి దశల వారీగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్‌గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా బుధవారం చైర్మన్ గఫార్ పట్టణంలోని అర్బన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కొత్త విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని, లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని విన్నవించారు. దీంతో చైర్మన్ గఫార్ అర్బన్ కాలనీలో ఎక్కడెక్కడ విద్యుత్ కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలనేది గుర్తించాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. అర్బన్ కాలనీలో త్వరలో పూర్తిగా విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్శిటీ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో మంజూరు చేసిన సబ్ స్టేషన్ నిర్మాణం పనులు చివరి దశకు వచ్చాయని, త్వరలో దాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అర్బన్ కాలనీలో నూతన సబ్‌స్టేషన్‌తో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జేఎల్ఎం మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు ముస్తఫా, స్వామి, సుందరరావు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి శుభాకాంక్షలు

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగను ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

రామాచార్యులకు ఘన సన్మానం

ఒంగోలు మెట్రో: లయన్స్ క్లబ్ ఒంగోలు ఆధ్వర్యంలో క్లబ్ వైస్ చైర్మన్ తాని రాఘురామయ్య అధ్యక్షతన సంతనూతలపాడులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ధూపాటి రామాచార్యులును బుధవారం ఘనంగా సన్మానించారు. అయనతో పాటు కేరళ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కల్పవల్లి, రచయిత్రి, నరసం ఉపాధ్యక్షురాలు సూర్యకుమారిని సన్మానించారు. ఒంగోలులోని విజయ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూకతోటి శరత్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కోశాధికారి అద్దంకి శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ, గవర్నర్ మోహన్‌రావు, గవర్నర్ 2 చలువాది హరిప్రసాద్, తేళ్ల అరుణ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



శభాష్ వలంటీర్స్..

- హైదరాబాద్, గుంటూరు వెళ్లి పింఛన్లు అందజేత



హైదరాబాద్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరసింహారావు



గుంటూరులో పింఛను అందజేస్తున్న వలంటీర్ దినేష్

జరుగుమల్లి: హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జరుగుమల్లి వాసి దగ్గుమాటి గోపాల్‌రెడ్డికి గ్రామ వలంటీర్ అన్నం నరసింహారావు రూ.2750 పింఛను అందజేశారు. గోపాలరెడ్డి తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేరారు. దూరం అని భావించకుండా పింఛను అందజేసిన వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామ సచివాలయం-2 పరిధిలో వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉండే మిడసల ఆదెమ్మ కిడ్నీ సమస్యతో ఒంగోలు జీజీహెచ్‌లో చేరారు. విషయం తెలుసుకున్న వలంటీర్ దార్ల దినేష్ పింఛను అందించేందుకు ఒంగోలు వెళ్లగా అప్పటికే ఆమెను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో వలంటీర్ దినేష్ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రూ.2,750 అందజేశాడు. వలంటీర్‌ను ఆదెమ్మ కుటుంబ సభ్యులతోపాటు కాలనీవాసులు అభినందించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరాలి



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్, ఐఎంఏ అధ్యక్షుడు జూలాది

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ పిలుపునిచ్చారు. జాహ్నవి నీట్ అకాడమీ ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అకాడమీ డైరెక్టర్ పి.జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం కాపాడుకుంటూ మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో కూడా పాల్గొనాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జూలాది మణిబాబు, ప్రిన్సిపాల్ చిత్ర, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

